# క్షమించు నాన్నా...

-శ్రీనివాసరాజు

నాన్న పడుకోనున్నారు. మొహం ప్రశాంతంగా వుంది. పెదవులు నవ్వుతున్నట్టున్నాయ్. ప్రక్కనే అమ్మ. పొంగుకొస్తున్న దుఃఖాన్ని పెదాల మధ్య అదిమి పెడితే సజలాలవుతున్న కళ్ళు. నలభై ఏడేళ్ళ అనుబంధం; ఐదు నిమిషాల్లో తెంచేసుకొని వెళ్ళిపోయాడు నాన్న. ఆయనకీ అంత అకస్మాత్తుగా వెళ్ళిపోవాలని ఎందుకుంటుంది? ఖచ్చితంగా వుండదు. మధ్యాహ్నం భోంచేద్దామని లేచిన మనిషి, ఓ వాంతి చేసుకొని కూలిపోయాడు.

మనసు పరిపరి విధాల ఆలోచిస్తోంది.

అరెరే! భోంచేయకుండానే పోయారే.

భోంచేసి పోతే ఫరవాలేదా?

ఏమో! మనకదో తృప్తిగా వుండేదేమో!

"ఆయనకి అంతటితో నూకలు చెల్లిపోయాయంతే"- అన్నారొకరు.

నాన్న లేరన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నా.

ఆయన కళ్ళ ముందే పడుకోనున్నారు, నవ్వుతూ.

ఆ నవ్వు నన్ను పరిహసిస్తున్నట్టుగా వుంది.

మనసుని పిండేస్తున్నట్టు ఒక గిల్టీ ఫీలింగ్.

ఆయన ఉండగా రోజూ కాసేపు మాట్లాడుతుండుంటే ఎంత బావుండేది?

ఇప్పుడేడిస్తే ఏం లాభం?

నాన్నొచ్చి మాట్లాడుతాడా?

కళ్ళనిండా నీళ్ళు కమ్ముకొంటున్నాయ్, మసక మసగ్గా.. కాసేపట్లో స్కూల్ నుండి చెల్లి వచ్చింది, చెప్పే పాఠాల్ని వదిలేసి; జీవిత పాఠాల్ని నేర్పిన నాన్నని కడసారి చూడ్డానికి.

అమ్మని కావిలించుకొంది.

దుఃఖం పెరుగుతోందో, తరుగుతోందో తెలీలేదు.

నాన్న అలానే వున్నారు, నిద్రపోతున్నట్టే.

ఆకలితో పోయినట్టేం అన్పించడంలా.

బంధువులు, స్నేహితులు ఒకరొకరుగా వస్తున్నారు.

చూస్తున్నారు... వెళ్తున్నారు.

ఆలోచనల్ని ఛేదిస్తూ పరామర్శలు.

నాన్న వయసెంత? ఎలా పోయారు?

అరెరే! ప్చ్, ఏం చేద్దాం? అంతే!

డెబ్భై రెండా, ఆహా! అయితే ఫర్లేదా?

జాతస్య మరణం ధృవం. నిజమే.

ఆ ఉద్వేగం, శోకం అనుభవించే శోకతప్త

హృదయాలకే గానీ అందరికీ ఉండదు కదా. ఎందుకుండాలి?

పెదాలు వణుకుతున్నాయ్. కళ్ళు చెమ్మగిల్లుతున్నాయ్.

జనం వస్తూ... పోతూ...

ఆ మధ్య సకుటుంబ సమేతంగా తిరుమల వెళ్ళినప్పుడు...

నా తొలి తలనీలాలు తీయడానికి నాన్న నన్ను తన భుజాల మీద తిరుపతి నుండి తిరుమలకి కాలినడకన తీసికెళ్ళడం, మధ్యలో నాన్న అలసటతో సోలిపోవడం, ఆకలికి కళ్ళు తిరగడం, సేదతీరడం... ఇవన్నీ చెబితే... నేను చిరాగ్గా 'ఎందుకలా నడిచి వెళ్ళడం' అంటూ విసుక్కోవడం... జ్ఞాపకాల దొంతర దొర్లి ఒకటొకటిగా గుండెల్ని పిండుతూ...

కాసేపటికి 'వియ్ ఫీల్' నుండి ఫ్రీజర్ బాక్స్ వచ్చింది.

పేరు బావుంది 'వియ్ ఫీల్' సందర్భోచితంగా.

పేరే, ఆ మనుష్యులలా ఫీలవుతున్నట్టేం లేదు.

జీతానికి పన్జేసేవాళ్ళు, వాళ్ళెందుకు ఫీలవ్వాలి... మా నాన్న పోతే.

అయినా కాస్త ఇన్‌వాల్వ్‌మెంట్, సరైన యాటిట్యూడ్ వుంటే బావుంటుందేమో. అది వాళ్ళిష్టం.

నాన్నకి బట్టలు మారుస్తున్నారు, ఫ్రీజర్ బాక్స్‌లో పెట్టడానికి. అయ్యయ్యో, నాన్నకి చేతులు నొప్పెడతాయేమో, ఆ షర్ట్ కాస్త మెల్లగా మార్చండి... మనసు మూలిగింది.

ఫ్రీజర్ బాక్స్‌లో నాన్న... ఫ్రెష్‌గా...

సాయంత్రం ఆఫీస్ మిత్రులొచ్చారు.

ఉద్వేగంతో కళ్ళ నుండి నీళ్ళు జలజల రాలాయ్. ఓదార్చారు.

ఇంటి ముందు షామియానా.. కుర్చీలు.. జనాలు...

లోకాభిరామాయణం.. కబుర్లాడుకొంటూ...

వాళ్ళు కబుర్లాడుకొంటే నీకేంటి బాధ? నీ బాధ అందరి బాధవుతుందా! ఎలా అవుద్ది? విచారంతో మొహాల్ని వేలాడేసుకోవాలా?

లోకంలో అందరి దుఃఖాల్నీ, సుఖాల్నీ, సంతోషాల్నీ అందరూ పంచుకోవాలా? సింపతీయా? వీలవుద్దా! ఎందుకవదు? స్వార్థాన్నీ, అసూయా ద్వేషాల్నీ ప్రక్కన పెట్టేసి, వీలైతే విసిరికొట్టి పక్కవాడి సంతోషాన్ని నీ సంతోషంగా, వాడి ఆవేదనని, దుఃఖాన్నీ నీ కష్టంగా కాస్త అనుభవించి చూడు. ఎంత గొప్పగా వుంటుందో! ఈ ప్రపంచంలో అత్యంత సంతోషకరమైన విషయం, ఇతరుల్ని సంతోషంగా వుంచడమే. నిజంగానే! అవును నిజంగానే.

అనుభవించి చూస్తేగానీ అర్థంకాని నిజం.

'అతిథి దేవోభవ'...

కాఫీ కప్పులతో మా అమ్మాయిలు సుషమ, సంఘమిత్ర.

ముప్ఫై నాలుగేళ్ళొచ్చినా నిలకడలేని జీవితాన్ని మోసుకుంటూ తమ్ముడు, వాడి కుటుంబం దిగారు ఊరి నుండి. దిగాలు మొహాల్తో.

నాన్న కదొక్కటే బెంగ. అయినా ఇప్పుడా మొహంలో ఏ బెంగా.. దిగులు లేవే. ప్రశాంతంగా నిద్రలో ఉన్నట్టే ఉన్నాడు.

గడియారం తన పని తాను చేసుకుపోతోంది.

కాలం ఎవరి కోసం ఆగుతుంది?

ఆగితే కాలం ఎందుకవుద్ది?

ఈ ప్రపంచం ఆవిర్భావం నుండీ, ప్రపంచ ఆవిర్భావమేంటి?

అంతకు ముందో! ఎప్పటినుండో,

కోటానుకోట్ల జననాల్నీ, మరణాల్నీ, అజరామరమైన ప్రేమల్నీ, రాజ్యాల్నీ, సామ్రాజ్యాల్నీ, పురోగమనాల్నీ, పతనాల్నీ, యుద్ధాలనీ, ప్రమాదాలనీ, ప్రమోదాలనీ తనలో ఇముడ్చుకొని నిరంతరం సాగిపోయే కాలం.. అలుపూ.. సొలుపూ లేని.. అనంత మైన ప్రయాణం...

రాత్రి పది.. పదకొండు.. అర్ధరాత్రి...

మౌనం రాజ్యమేలుతోంది.

సముద్రంలో అలల్లా, మనసులోంచి, గుండె లోతుల్లోంచి

దుఃఖపు అలలు కనుకొలకుల్ని తాకుతూ...

నాన్న నిద్రపోతున్నారా? దీర్ఘ నిద్రా.. శాశ్వతంగా..

అశాశ్వతమైన ఈ ప్రపంచపు బంధనాలని

ఛేదించుకొని శాశ్వతమైన ఏ లోకానికో!?... ఎక్కడికో?

నాన్నా, లేచి కాసేపు మాట్లాడవూ? నా కోసం, ప్లీజ్...

ప్రొద్దుట ఆఫీస్‌కెళ్తే... రాత్రికి రావడం, చిరాగ్గా.. విసుగ్గా.

నాన్నలా కూర్చోనున్నా, ఏం మాట్లాడాను?

మాట్లాడే తీరికలేకనా? తెలియని నిర్లక్ష్యమా? ఏమో!

కాస్త మాట్లాడుతుంటే ఆయనకెంత సంతోషంగా వుండేదో!

అయినా ఇంత అకస్మాత్తుగా వెళ్లిపోతారని ఎవరనుకొంటాం? ఎవరికి తెలుసు?

తెలిస్తే... మాట్లాడుతుండొచ్చా...

నిజంగా నాన్నతో మాట్లాడాలనుంది.

అర్ధరాత్రి వేళ మనసు మహా దుఃఖసాగరంలో మునుగుతూ రోదిస్తోంది నిశ్శబ్దంగా.

ఆలోచనల్ని ఛేదిస్తూ మరోరోజు పొడుచుకొచ్చింది.

ఇంట్లో అందరి మొహాలూ నీరసంతో వ్రేలాడు తున్నాయ్.

జనం వస్తూ.. పోతూ...

షామియానా నీడలో పేపర్లు చదువుతూ...

పేపర్ చూడందే నాకు రోజు పూర్తవదు.

నాన్న నేర్పిన అలవాటే. చిన్నప్పట్నించీ రోజూ లైబ్రరీకి వెళ్ళడం. అక్కడున్న పేపర్లన్నీ తిరగేయడం.

వయసుతో పాటు మంచి, మంచి పుస్తకాలు చదవడం.. మనుష్యుల్ని, ప్రపంచాన్నీ చదవడమూ అలవాటైంది.

ఏం చదివి ఏం లాభం?

ఆయన మనసుని చదవలేక పోయానా?

ప్రేమ, ఆప్యాయం మనసులో వుంటే ఏం లాభం?

పంచుకోలేకపోతే?

నాన్న ఇంతసేపు మాట్లాడకపోయినా...

కళ్ళ ముందే నిద్రపోతున్నారు.

ఆ దృశ్యం కూడా కనుమరగయ్యే అంతిమ యాత్ర ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం హృదయాన్ని పిండితే శరీరం తడబడి, కళ్ళు తడవుతూ.

భాషకందని భావాల్నీ, ఉద్వేగాల్నీ ఆవిష్కరిస్తూ.. ఇంతకాలం నాన్న నడిచిన రోడ్డు మీదే నలుగురు మనుష్యులు ఆయన్ని మోసుకెళ్తున్నారు.

ముందు నడుస్తూ... నేను

ఈ విశాల విశ్వానికి నన్ను పరిచయం చేసిన నాన్న, చేయి పట్టుకొని జాగ్రత్తగా రోడ్డు మీద నడిపిస్తూ... నడక, నడత నేర్పించిన నాన్న.. నాకు సైకిల్ నేర్పిందీ నాన్నే... మా 'రేపటి' కోసం ఆయన 'నేటి'ని కొవ్వొత్తిలా కరిగించిన నాన్న...

మంటల్లో దహించుకుపోతూ.. నాన్న...

చెట్టంత మనిషి - గుప్పెడు బూడిదవుతూ...

ఎక్కడికీ ప్రస్థానం?

నాన్నా, కాస్త మాట్లాడవూ?

ఏంటి మాట్లాడ్డం?

రోదిస్తున్న మనసుకి ఏంటి చెప్పడం?

బరువెక్కిన హృదయం - కళ్ళనిండా నీళ్ళు, పశ్చాత్తాపంతో కుమిలిపోతున్న మనసు..

'క్షమించు నాన్నా... క్షమించు' అంటూ దిగంతాల కేసి దూసుకుపోతున్న నాన్నని అర్థిస్తోంది.

ఆర్తితో అరిచి, అరిచీ చెబుతోంది.

మీ కన్నవాళ్ళనే కాదు, పెద్దవాళ్ళందర్నీ ప్రేమగా పలకరించండి. కాసేపు మాట్లాడుతుండండి. మీ ప్రేమని పంచండి.. వాళ్ళ ప్రేమని పొందండి. మీ కోసం కరిగిపోయిన జీవితాల్లో, వాత్సల్యపు కాంతుల్ని నింపండి. వాళ్ళ జీవితపు సంధ్యల్ని సంతోషమయం చేయండి. ■